
తెలుగుకళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన కథ

# ఒరేయ్! చెరపకురా చెడేవు

## మంజూష






పావనమూర్తి సిగరెట్ వెలిగించుకుని, పొగ గుండెల్నిండా పీల్చుకుని బైటకి వది లాడు. మనసులో టెన్షన్ కాస్త తగ్గినట్ల న్పించింది. సీట్లో కూలబడి టేబుల్ మీద ఎదురుగా కనబడిన ఫైల్ని దగ్గరగా లాక్కుని చదవడం మొదలుపెట్టాడు. ఒక్కక్షరం బుర్రకెక్కడం లేదు. మన సంతా విపరీతమైన ఆందోళనగా, అసహ నంగా వుంది. శరీరమంతా వణుకుతోంది.

తననుకున్నట్లు జరుగుతుందా? జరగక ఏమవు తుంది. బ్రహ్మాండమైన ప్లాన్ వేసాడు తను. మధు సూదనం, తనూ ఒకే రోజు ఉద్యోగంలో చేరారు. అప్పట్నించీ ప్రతీ క్షణం...వెధవ తనతో పోటీయే. తమ కొలీగ్ రాధ నిద్దరూ ప్రేమించారు. కాని ఆవిడ గారు మధుగాడ్ని వలచి పెళ్ళాడిన రోజున తనింత ఇదిగా బాధపడలేదు. తెల్లగుర్రమెక్కేసి బాధని మరిచి పోవడానికి ప్రయత్నించాడు. తన కొడుకు ఆవారాగా తిరుగుతూండొచ్చు. కాని అందరి ముందూ తనకి పిల్లల్ని పెంచడం రాదన్నట్లు మాట్లాడిన రోజున తను బైటపడలేదు. డిగ్రీలమీద డిగ్రీలు సంపాదించేసి ప్రమోషన్లు కొట్టేసిన రోజున కూడా 'అతని అదృష్టం' అని సరిపెట్టుకున్నాడు. కాని ఈ రోజున తన కూతురికి కుదరాల్సిన పెళ్ళి సంబంధం చెడగొట్టి తన కూతురికి కుదుర్చుకున్నాడు. అందులో అతని ప్రమేయం ఎంత వరకూ అన్నది తనకనవసరం. పెళ్ళి కొడుకు తండ్రి మధుగాడికి ఫ్రెండుట. నూరు అబద్ధాలాడైనా పెళ్ళి చెయ్యమన్నారు పెద్దలు. కాని వీడు...ఈ మధుగాడేం చేశాడు? బోడి ప్రిన్స్‌పుల్స్. అబద్ధం పలకడట. తన కూతురు ఈ కాలం వాళ్ళలా మగపిల్లల్తో స్నేహం చేసే వుండొచ్చు. ఆ మాటెందుకు చెప్పాలి? మనసు విరిగి పోయిన ఆ పెళ్ళికొడుకు తండ్రికి కాకతాళీయంగా మధుగాడి కూతురు కనబడిందట. ఆ పెద్ద మనిషి మురిసి ముక్కలైపోయి 'ఏ పిల్ల నా ఇంటి కోడలు కావాల్సిందేనని' పట్టుబట్టాడట. వీడు వచ్చినట్లు ఒప్పు కోవాల్సొచ్చిందట. బంగారంలాంటి మాచ్. కానీ కట్నం లేకుండా అమెరికా అల్లుడు వస్తాడని తనెంత సంబరపడ్డాడు? ఆ ఛాన్స్ వాడు కొట్టేశాడు. పైగా ఎంత అప్రతిష్ట! పైగా ఆ సంగతి తన దగ్గరకొచ్చి ఎలా చెప్పాడు- "ఇందులో నా తప్పేమీ లేదు మూర్తీ. చాలా ఏక్సిడెంటల్‌గా అతను మా అమ్మాయిని చూడటం, కోడల్ని చేసుకుంటానని పట్టు పట్టడం జరిగింది" అంటూ తన చేతులు పట్టుకున్నాడు. దగా! నటన. అంతా మోసం. వచ్చినా ఈ పెళ్ళి జరగనివ్వడు తను! కనీసం మధుగాడి కళ్ళముందు!! అందుకే తను ప్లాన్ వేసాడు.

అదేం ఆదర్శమోకాని, ఏమన్నా ప్రాజెక్ట్ మొద లెడితే ల్యాబ్ వర్క్ కూడా మధే చూసుకుంటాడు. అసిస్టెంట్స్ మీద వదిలేసి హాయిగా వుండడు. పేపర్స్ కూడా కరెక్ట్ బయోడేటా వుండాలికాని ఏదో చేసి ఏమో వ్రాయడు. 'ది హానరబుల్ గ్రేట్ సైంటిస్ట్... డాక్టర్ మధుసూదనం' ఇంకొక్క గంటలో ఏమవు తాడు? చావొచ్చు. లేదా గుడ్డివాడవొచ్చు. కనీసం వంట్లో సగం రక్తం పోగొట్టుకోవచ్చు. హీటర్ మీద గ్లాస్ జార్ పెట్టాడు తను. దానికి చాలా చాలా సన్నటి చీలిక వుంది. అందులో పర్ క్లోరిక్ ఏసిడ్ పోసాడు తను. పక్క టేబుల్ దగ్గర ఏదో ఎనాల్సిస్ చేస్తున్న మధుసూదనాన్ని అడిగాడు తను. "కాస్త చూస్తూం టావా మధూ...కొద్దిగా పనుంది. నా రూమ్ కెళ్ళొ స్తాను." మధుసూదనం చిరునవ్వుతో అంగీకరించాడు. తను సీట్‌గా ఇవతలికొచ్చేసాడు. తనకి తెల్సు మధు పని కనీసం రెండు గంటల వరకైనా పూర్తవదని. వాడక్కడే వుంటాడు. చీలికలోంచి ఏసిడ్ మెల్లమెల్లగా కారి ఒక్క చుక్క హీటర్ మీద పడ్డ క్షణం...ఇనిస్టిట్యూట్ అంతా పెద్ద శబ్దంతో దద్దరిల్లిపోతుంది. వీడి పార్ట్స్ కూడా దొరకవేమో! వలచి వలపించుకుందిగా రంభ... రాధ ఏడుపు చూసి తీరాలి. ఎన్నో రోజులుగా అణుచు కున్న తన కసి ఈ రోజు తీరుతుంది. పుట్టలో పడుకున్న త్రాచు తోకని గిల్లినట్లు తనని గిల్లాడు వాడు. పగ... పాము లక్షణం. ఏమిటి? కణతలు పగులుతున్నట్లు బాధ? వెధవది హై బి.పి. తనకి. తలలో నరాలు చిట్లు తున్నట్టు ఏదో టెన్షన్. తను మామూలుగా వుండాలి.

తననో సాధు జంతువుగా, మధుసూదనాన్ని పెద్ద




పులిగా చిత్రీకరించుకోవడానికి ప్రయత్నించాడు. కాని పోలిక కుదరడం లేదు. మనసంతా తుఫానులో ఆకులా వణికిపోతూంది. గడియారంలో సెకను ముల్లు జరుగుతూంటే నరాల్ని ఎవరో సాగదీస్తున్న భావన. బట్టలు చెమటతో ముద్దయ్యాయి. ఎంత కాదనుకున్నా మెదడులో ఒకటే దృశ్యం. గ్లాస్ జార్ పగులులోంచి కారబోతున్న ఏసిడ్ వెల్లి మంట మీద పడటం. పెద్ద మెరుపు. అలుముకుంటున్న మంటల్లో మాడి మసవుతున్న మధుసూధనం. దీనంగా ఏడుస్తున్న రాధ ముఖం.

కాలం గడుస్తున్న కొద్దీ వెడెక్కిపోతున్న గాజు గిన్నెలా వున్నాడతను. వెళ్ళాలి. తను కారిడార్ చివర్న నిలబడితే లాబ్ కనబడుతూ వుంటుంది. లేచాడు పావన మూర్తి. శరీరం పెద్ద ఇనుప దుంగలా వుంది. బలవంతంగా శరీరాన్ని కారిడార్ స్తంభం వరకూ ఈడ్చుకొచ్చి స్తంభానికి చేరబడి నిలబడ్డాడు. బి.పి. సర్రున పెరిగిపోతోంది. మెదడులో ఏదో తెగిపోతున్న బాధ. ఫ్యాన్‌ని పిలవాలనుకున్నాడు. ఎంత ప్రయత్నించినా నోట్లోంచి మాట బైటికి రావడం లేదు. తనకేం జరుగుతోందో తెల్సుకునేలోపునే స్పృహ తప్పింది పావనమూర్తికి.

మళ్ళీ స్పృహ తెల్సేటప్పటికి హాస్పిటల్లో వున్నట్టు గ్రహించాడు పావనమూర్తి. లేచి కూర్చోవాలనుకున్నాడు. కుడి చెయ్యి, కుడికాలు స్వాధీనంలోకి రావడం లేదు. అతని గుండె ఝల్లుమంది. సర్వ శక్తులూ కూడదీసుకుంటుంటే నోట్లోంచి ఏవో శబ్దాలు బైట పడుతున్నాయి. అతనికి అర్థమైంది. తనకి పెరాల్సిస్...

పావనమూర్తి కళ్ళల్లోంచి కన్నీరు జలజలా కురిసింది.

అలాంటి పరిస్థితిలో కూడా అతనిలో కదుల్తూ తొలిచేస్తున్న ఆరాటం 'మధుసూధనం ఏమయ్యాడు?'

"డోంట్ బీ సిల్లీ...మూర్తీ" ఎవరో మృదువుగా తన కన్నీళ్ళు తుడుస్తున్నారు. చటుక్కున కళ్ళెత్తి చూసాడు పావనమూర్తి, ఆ కంఠ స్వరాన్ని గుర్తించి. అతను మధుసూధనం. పావనమూర్తి నవనాడులూ జారిపోయి నట్లయ్యాయి. విశ్వప్రయత్నం మీద తనడగదల్చుకున్నది అడిగాడు పావనమూర్తి.

"ఓహ్...లాబ్‌లో నీ ఎనాల్సిస్సా! భలే వాడివోయ్...అసలు హీటర్ స్విచ్ ఆన్ చేయకుండా ఎక్స్‌పరిమెంట్ నా కప్పజెప్పి వెళ్ళావు. నాపని సగంలో వుండగానే ఎవరో వచ్చి చెప్పారు. "నువ్వు పడిపోయావని. అన్నీ ఆపేసి పరుగెట్టుకొచ్చాను. వర్కదేముందిలే. ముందు నువ్వు మనసు ప్రశాంతంగా వుంచుకోవాలి."

ఈ సారి పావనమూర్తి కళ్ళల్లో కన్నీటి జలపాతాలకి అంతేలేదు.

